క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక ఫాతెహాలు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: మండల కేంద్రంలో మత సామర స్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

ముగ్గురు సీఐల నియామకం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లకు సీఐలను నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వన్‌టౌన్ సీఐగా కర్నూలులో వీఆర్‌లో ఉన్న తేజమూర్తి, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కర్నూలులో వీఆర్‌లో ఉన్న గోపీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ నియమించబడ్డారు. వన్‌టౌన్ సీఐ విక్రమసింహా గత నెలలో బద్వేల్‌కు బదిలీ అయ్యారు. టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్, ట్రాఫిక్ సీఐ పార్థసారథి కర్నూలు వీఆర్‌కు వెళ్లారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదోనిఅర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ నిర్వాహకుడు రాయచోటి సుబ్బయ్య ఆధ్వర్యంలో గురువారం మహాయోగి లక్ష్మమ్మ ఆధ్యాత్మిక కేంద్రంలో 4, 5వ తరగతుల విద్యార్థులకు జనరల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆదోని, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వివిధ పాఠశాల విద్యార్థులు 175 మంది పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి స్థానంలో బి.మహ్మద్‌జునైద్, 5వ తరగతి భాష్యం స్కూల్, రెండోస్థానంలో ఆర్.రితీష్, 5వ తరగతి లీలాస్ పాఠశాల, మూడోస్థానంలో సి.సర్వత్, 4వ తరగతి సి.మల్లికార్జున విద్యాలయం గెలుపొందారని, వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు మేనేజర్ జి.మురళీకుమార్, డైరెక్టర్ కె.ఆంజనేయులు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్క నాటుతున్న పురపాలక చైర్మన్ శాంత, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకోవాలని పురపాలక చైర్మెన్ బి.శాంత పేర్కొన్నారు. గురువారం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ వజ్రోత్సవాలను పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర సోషల్ మీడియాయ కన్వీనర్ వీరచంద్రయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 4 నుంచి 6వ తేదీ వరకు జిల్లాలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలోని పురపాలక ప్రాథమిక పాఠశాల, సంతపేట బాయ్స్, సంతపేట గర్ల్స్, అర్దగేరి బసవన గౌడు, అండర్‌పేట పురపాలక పాఠశాలల్లో వంద మొక్కలు నాటినట్లు చెప్పారు. నాయకులు జంబులయ్య, వీరేష్, గురురాజా, అబీదాబేగం, రాజ్యలక్ష్మి, రాముడు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా జగనన్న పాలన



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వై.జయమ్మ

కౌతాళం : నవరత్నాల పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మెచ్చేలా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు, కాచాపురం సర్పంచు వై.జయమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బదినేహాల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని, పథకాల అమలుపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రంగాన్ని ప్రగతి బాట పట్టించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ముఖ్యంగా మహిళా సంక్షేమం, మహిళా భద్రత, మహిళలకు చట్టసభల్లో స్థానం కల్పించారని గుర్తు చేశారు. 50 శాతం మహిళలకు రిజర్వేషన్ అమలుచేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, నాయకులు రవిగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, రౌడూరు సర్వారెడ్డి, సరస్వతి, జయమ్మ, ఎంపీడీఓ సుబ్బరాజు, కార్యదర్శి అబ్దుల్ వాహిద్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



సమావేశానికి హాజరైన ప్రజలు

ఆదోని టౌన్/ ఆదోని సెంట్రల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం పురపాలక మైదానంలో చైర్మెన్ బి.శాంత అధ్యక్షతన పెన్షన్ల పంపిణీ కార్యాక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంపును దశల వారిగా పెంచుతూ రూ.3000కు చేరుస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. పట్టణంలో 17,399 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఇందుకు నెలకు రూ.5,24,60000 వెచ్చిస్తున్నట్లు వివరించారు.

ఇది కాదా అభివృద్ధి..

నాడు–నేడు పనులతో పాఠశాలలు, ఆసుపత్రులను రూపు రేఖలను మార్చామని, గతంలో ఆసుపత్రులు, పాఠశాలల్లో వసతులు లేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. నేడు ఆసుపత్రులు, పాఠశాలలు కార్పొరేట్‌ను తలపిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో తాగునీటి అవసరాల నిమిత్తం బసాపురం, పెద్దహరివాణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాల, ఉర్దు కళాశాలలనుతీసుకొచ్చామని, ఓవర్ బ్రిడ్జి, బైపాస్ రహదారులను ఏర్పాటు చేశామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రతి వార్డు సచివాలయంలో రూ. 40 లక్షలతో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్నామని, పురపాలక పరిధిలోని 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ అభివృద్ధి ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్న వారు ఒక్క సారి పట్టణం, నియోజకవర్గంలో పర్యటించాలని సూచించారు. ఆదోనిలోని ఈద్గా నిర్మాణం చేపట్టే బాధ్యత తనదేనని రూ.1.75 లక్షలతో ప్రతిపాదనలు కూడా పంపినట్లు పేర్కొన్నారు.

పింఛనే జీవనాధారం



కొత్తగా పింఛన్ తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. గతంలో నా భర్త దాదసాబ్‌కు పింఛన్ వస్తుండేది. ఆయన చనిపోయి మూడు నెలలైంది. వితంతు పింఛన్ కోసం ఇబ్బంది పడలేదు. వలంటీర్ ఇంటికొచ్చి దరఖాస్తు చేయించాడు. నాకు నలుగురు కుమారులు ఎవరికి వారు వేరుగా జీవనంసాగిస్తున్నారు. వృద్ధాప్యంలో మా అవసరాలకు ఎవరు డబ్బులు ఇస్తారు. ఏవైనా మందులు తీసుకోవాలన్నా, ఖర్చులకు ఈ పింఛన్ సొమ్ము నాకు జీవనాధారం.

– ఫాతిమాబీ, అమరావతి నగర్, ఆదోని

చాలా సంతోషంగా ఉంది



గతంలో పింఛన్ కోసం అనేక సార్లు తిరిగినా రాలేదు. సమస్యను వలంటీర్‌కు తెలియజేయగా దరఖాస్తు చేయించింది. నాకు కొత్తగా పింఛన్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. నాకు ఇద్దరు కూమారులు ఎవరి కుటుంబం వారు చూసుకుంటారు. కూలీ పనులు చేసుకుని జీవనం చేసే మాలాంటి వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఆధారం.

– నాగలక్ష్మి, అరుణ్‌జ్యోతి నగర్, ఆదోని

పింఛన్ల పంపిణీ



మరాఠీవాడిలో వృద్ధురాలికి పింఛన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ రేణుక

ఆదోనిటౌన్: పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. కొత్తగా పింఛన్ మంజూరైన 316 మందితో పాటు పాత పింఛన్‌దారులతో కలిపి మొత్తం 17,083 మందికి రూ.5,24,68,000 మొత్తాన్ని వార్డు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పంపిణీ చేశారు.



ఇందిరానగర్‌లో పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిటౌన్: సంక్షేమ పథకాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. గురువారం పట్టణంలోని 42వ వార్డు హనుమాన్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వీధుల్లో పార్టీ జెండాలతో ప్రదర్శన చేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. డిస్ ప్లే బోర్డును ప్రజల ముందు ఏర్పాటు చేస్తూ వివరాలను చదివి వినిపించారు. సమావేశంలో ఎమ్మెల్సీ, దేవా మాట్లాడారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్ లోకేశ్వరి, వార్డు ఇన్‌చార్జ్ నాగరాజు, కన్వీనర్‌లు శ్రీను, కృష్ణారెడ్డి, అశోక్, ఈరన్న, కరీం, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



గంధం తీసుకెళ్తున్న వంశస్తులు



పాల్గొన్న వివిధ దర్గాల పీఠాధిపతులు

వైభవంగా గంధం వేడుకలు

కౌతాళం: మండల కేంద్రమైన నుంచి గురువా రం గంధంను వైభవంగా కర్ణాటక రాష్ట్రం కురుగోడుకు తీసుకెళ్లారు. జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాకు 10వ ధర్మకర్తగా, ముతవల్లిగా 41సంవత్సరాలు సేవలు అందించి 2022 జనవరి 26న మృతి చెందిన సయ్యద్ సాహెబ్‌పీర్ వుశేని చిష్టీ రెండవ ఉరుసు శుక్రవారం నేడు కర్ణాటక రాష్ట్రం కురుగోడులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం గంధంను గ్రామ వీదుల్లో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక చాదర్‌ను, ప్రత్యేక వాహనంలో గంధం తరలించారు. కార్యక్రమంలో బీదర్ దర్గా పీఠాధిపతి నజీమ్‌హుసేన్, సర్మస్‌వలి దర్గా వంశస్తుడు సయ్యద్ దూద్‌బాషా, వివిధ దర్గాల పీఠాధిపతులు పాల్గొన్నారు. ఖాదర్‌లింగస్వామి దార్గ ధర్మకర్త సయ్యద్ మున్నపాషా పాల్గొన్నారు.

నిబంధనల మేరకే స్థలం లీజుకు ఇచ్చాం

ఆదోనిటౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోనున్న ఏపీ ఎన్‌జీవోస్ కార్యాలయం స్థలాన్ని బైలాస్ ప్రకారం, నిబంధనల మేరకే లీజుకు ఇచ్చామని సంఘం ఆదోని తాలూకా అధ్యక్షుడు రమేష్‌రెడ్డి తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవన నిర్మాణానికి రాష్ట్ర, జిల్లా కమిటీల్లో తీర్మానం చేసి లీజుకు ఇచ్చామన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎన్‌జీవోస్‌కు సంబంధించిన స్థలమని, ప్రభుత్వానికి చెందినది కాదని పేర్కొన్నారు. పత్రికా ప్రకటన ద్వారా కాంట్రాక్టర్‌కు కొత్త భవన నిర్మాణానికి అప్పగించామని తెలిపారు. కాంట్రాక్టర్ రూ.40 లక్షలు తమకు చెక్కు రూపంలో చెల్లించారన్నారు. ఎన్‌జీవోస్‌కు సంబంధించిన భవనం నిర్మించి మిగిలిన ఆరు సెంట్ల స్థలంలో స్థానిక నాయకులు భవనాన్ని నిర్మించుకున్నారన్నారు. ఆ భవనానికి అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే కొందరు ఎన్‌జీవోలను బెదిరించి బలవంతంగా స్థలాన్ని కబ్జా చేశారని ప్రకటనలు చేస్తున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సభ్యులు గౌస్‌పీరా, రామకృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ



ఊరేగింపుగా వెళ్తూ అక్షితలు అందజేసున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: ఈనెల 22వ తేదీన అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షితల పంపిణీ కార్యక్రమం జోరందుకుంది. గురువారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, హిందూ భక్తులు రామాలయంలో రాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాముడి చిత్రపటంతో ఊరేగింపుగా ఇంటింటికీ అక్షితలు అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, సభ్యులు కునిగిరి నాగరాజు, మనోహర్, నాగరాజుగౌడ్, చెన్నబసప్ప, వీరేష్ మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి విక్టోరియా పేటలోని రామాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



పెద్దకడబూరులో మహిళలకు భరోసా ఇస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చౌడేశ్వరి కాలనీ, లక్ష్మీపేటలోని ప్రతి గడపకు తిరిగి మహిళలు, వృద్ధులను కలసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలను వివరిస్తూ ఈ నాలుగున్నర సంవత్సరాల్లో ఒక్కో కుటుంబానికి ఎంత డబ్బులు అందాయో వివరించారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంతో ఉన్నారని, ఈ ఆనందం ఇలాగే కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనే ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, హౌసింగ్ ఏఈ వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, వ్యవసాయాధికారి వరప్రసాద్, ఆర్ఐ మహేష్, నాయకులు రవిచంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి, శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి అర్లప్ప, పూజారి ఈరన్న,శాంతిరాజు,మునిస్వామి, రామాంజి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడంలో జగనన్నకు సాటిలేరు



మంత్రాలయంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవ్వరూ సాటి లేరని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. గురువారం స్థానిక సంతమార్కెట్‌లో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద నూతనంగా మంజూరైన పింఛన్లను టీటీడీ సభ్యులు వై.సీతారామిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 90 శాతానికిపైగా హామీలు నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా జగనన్న చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. అనంతరం మండలంలో నూతనంగా మంజూరైన 106 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనకభాగంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ–2 భవనం, రూ.17.50 లక్షలతో కట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సముదాయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, కల్లుదేవకుంట సింగిల్ విండో ప్రెసిడెంట్ రఘునాథ్‌రెడ్డి, ఉప సర్పంచు పరమేష్, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీడీఓ మణిమంజరి, ఎంఈఓ మొయినుద్దీన్, పీఆర్ డీఈ అశ్వత్థామ, ఏఈ నరసింహులు, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, నాయకులు జనార్ధన్‌రెడ్డి, వీకేసీ రాఘవేంద్ర, శివకుమార్, బొంబాయి శివ, పెట్రోల్‌బంక్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



వందగల్లులో లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

పేదల జీవితాల్లో వెలుగులు

కోసిగి: సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వందగల్లు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డితో కలిసి సర్పంచ్ కొరవంజమ్మ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు, కాల్వ లక్ష్మయ్య, ఉస్మాన్, ఎంపీటీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆదోనిసెంట్రల్: యూటీఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్, జహంగీర్, సీనియర్ నాయకులు ఫయాజుద్దీన్, రంగన్న ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. పట్టణ గౌరవాధ్యక్షులు సునీల్‌రాజ్‌కుమార్, గిరిబాబు, మల్లికార్జున, మహేష్, జియావుద్దీన్, అయూబ్, నగేష్, సల్మాన్, సుధాకర్, విష్ణు, ఇమ్రాన్, సాదిక్ పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

కౌతాళం: ఈనెల 6వ తేదీన వైఎస్సాఆర్ పింఛన్ల కానుక పథకం కింద కొత్తగా మంజురైన పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హాజరువుతారని, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా జీవించాలి



సొలహళ్లి వాసులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం : పల్లెల్లో ప్రజలు గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని సొలహళ్లి గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, కక్షలు పెంచుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. పంతాలకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

అక్షితల పంపిణీ

కౌతాళం: అయోధ్య అక్షితలను మండలంలోని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ నాయకులు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, నరేష్, గంధబసవ తెలిపారు. గురువారం పాల్తూరు స్వామికి, మండలంలోని వివిధ ప్రముఖులకు అందజేసినట్లు చెప్పారు. రామమందిర చిత్రపటం, తీర్థ క్షేత్ర కరపత్రము, మృగముద్రలో అక్షితలను అందజేశామన్నారు.

పరీక్షల సమయంలో ఆందోళనకు గురికావద్దు



పరీక్ష పేపర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పరీక్ష సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికాకూడదని బాలికల పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈఓ జి .వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో పదో తరగతి టాలెంట్ టెస్ట్ పరీక్షలను డీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఉదయ్, డివిజన్ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టాలెంట్ టెస్ట్ ఎగ్జామ్స్ పేపర్స్ డైరెక్టర్ అరుణ్‌రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

పశువులకు గాలికుంటు టీకాలు

హాలహర్వి: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు గ్రామ పశువైద్యాధికారి వీరకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో పాడి పశువులకు టీకాలు వేశారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం, నోటి నుంచి చొంగ, నోటిలో పండ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు అని వివరించారు. ఈ లక్షణాలు ఉన్న పశువులను యజమానులు ఆస్పత్రికి తీసుకొస్తే టీకాలు వేస్తామన్నారు. ముందుస్తుగా వేయిస్తే వ్యాధి నుంచి రక్షణ లభిస్తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాసభవన్, షరాఫ్‌బజార్ మీదుగా భీమా సర్కిల్‌కు చేరుకుని కార్మికులు నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, వై.టి.భీమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, పట్టణ మండల కార్యదర్శులు సుధర్న్, కల్లుబావి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేలు జీతం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యుల్ కార్మికులుగా గుర్తించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు లక్ష్మన్న, జయ, యువరాజ్, జాన్‌బాబు, శేఖన్న, శాంత పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణాధ్యక్షులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక పంప్‌హౌస్ వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు కర్రెప్ప, సోమన్న, అహ్మద్, మూర్తి, ఈరన్న పాల్గొన్నారు.

నాటుసారా బట్టీ ధ్వంసం



దిబ్బనకల్ కొండలో నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోనిరూరల్: మండలంలోని దిబ్బనకల్ కొండ ప్రాంతంలో గురువారం అక్రమ మద్యంపై దాడులు నిర్వహించామని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. అక్కడ బోయ వెంకటేష్ అనే వ్యక్తి నాటుసారా తయారీ చేస్తుండగా గుర్తించి అరెస్టు చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం మండలంలోని బసాపురంలో వై.మునిస్వామి వద్ద 17 కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఉండగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ శివప్రసాద్, డీటీఎఫ్ ఎస్ఐ స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.